# కానుక

ఖంగుమంది కాలింగ్ బెల్. బద్ధకంగా లేచి తలుపు తీసింది ప్రీతి.

నవ్వుతూ కనిపించింది స్వప్న. ఆమెను చూస్తే వళ్ళు మండింది ప్రీతికి.

ఆమెకు నిండా పాతికేళ్లుండవు. పాలరాతి బొమ్మలా నిగనిగలాడుతూ చూడముచ్చటగా వుంటుంది. నుదుట కుంకుమే ఉంటే ఇంకెంత శోభాయమానంగా వుండేదో!

'ఏం కావాలన్నట్లు' అసహనంగా చూసింది.

"కాళిదాసుగారున్నారాండీ!" ఆమె పలుకుల్లో వినమ్రత ఉట్టిపడుతోంది.

"లేరు. షాపుకెళ్లారు!" విసురుగా చెప్పింది ప్రీతి.

"నేను అక్కడినుంచే వస్తున్నాను. ఇంటికిగానీ వచ్చారేమోనని..."

మరి మాట్లాడలేదు ప్రీతి. వెళ్లిపోయింది స్వప్న.

ప్రీతికి ఈమధ్య మగడి చర్యలేవీ రుచించడం లేదు. ఎంత స్నేహితుడి భార్య అయితే మాత్రం ఆమెతో అంత ఇదిగా ఉండాలా? చిన్న వయసులోనే అయిదోతనం పోగొట్టుకుని నిస్సహాయురాలైనందుకు ఎవరికైనా ఆమెపట్ల సానుభూతి ఉండడం సహజం. అందులోనూ అప్పుడి ఆర్ధాంగి కావడంవల్ల ఓ పాలు ఎక్కువ ఉంటే ఉండొచ్చు. అందులో తప్పుపట్టడానికి లేదు. అయితే తనకు నచ్చనిదల్లా ఆమె తరచూ తన భర్తని పనిగట్టుకుని కలవడమే. ఏదైనా సహాయం కావలసివస్తే నేరుగా తన అడగొచ్చుకదా! సుమారు నాలుగు నెలలవుతోంది. ఆమె ఈ ఊరు వచ్చిన దగ్గర నుండి తనను పెనిమిటి ఆమె గడప పట్టుకుని వ్రేలాడుతున్నాడు. ఇంకా ఊరుకుంటే తన కాపురానికే ముప్పు వాటిల్లే ప్రమాదం వుంది. అందుకే ఆమెపట్ల జాలికి బదులు క్రౌర్యం చోటు చేసుకుంది.

స్వప్న వెళ్లిన పది నిముషాల్లో వచ్చాడు కాళిదాసు. వస్తూనే "స్వప్న ఇక్కడకు వచ్చిందా?" అడిగాడు ఆదుర్దాగా.

"ఇప్పుడే వచ్చి వెళ్లింది" త్రుంచినట్లు సమాధానమిచ్చింది ప్రీతి.

"కాస్సేపు ఉండమనలేకపోయావా?"

"మీరుంటే ఆ మాట అనేవారేమో. నాకా అవసరం లేదు."

"ఏమిటా మాటలు ప్రీతీ!"

"ఉన్నమాటంటే ఉలుకెందుకు? ఆమెతో మీరీ మధ్య మరీ రాసుకుపూసుకు తిరగడం నేను గమనించలేదనా?"

"ప్రీతి!"

"ఔను ప్రీతినే. అందుకే అంటున్నాను. ఇకనుండైనా ఆమెతో సంబంధం తెగత్రెంపులు చేసుకోమని" ఉవ్వెత్తున లేస్తూ అన్నది ప్రీతి.

ఇదివరలో ఎప్పుడూ ఆమె మోము అంత ఎర్రగా మారిపోవడం గమనించలేదు కాళిదాసు.

"చూడు ప్రీతీ! స్వప్నని నేను ఈ ఇంటి ఆడబడుచుగా భావిస్తున్నాను. అందుకే ఆమె కన్నీళ్లల్లో పాలు పంచుకుంటున్నాను.

"ఈ డైలాగ్ ఏదో నవల్లో చదివినట్లు గుర్తు" ఎగతాళి చేస్తున్నట్లు అంది ప్రీతి.

"అంత నిర్లక్ష్యంగా మాట్లాడకు. నీకు గుర్తుండే ఉంటుంది. ఎనిమిదేళ్ళక్రితం మన పెళ్ళికి వచ్చి ఆశీర్వదించి అభినందించిన ఒకే ఒక ఆత్మీయుడు ఆనందరావు భార్యే ఈ స్వప్న. ఆమెను ఎవరనుకుంటున్నావో ఏమో! మనం ఈరోజు ఈమాత్రం ఉన్నతంగా బ్రతుకుతున్నామంటే పరోక్షంగా ఆమె భర్త చేసిన ఉపకారమే. అందుకు మనం వాళ్లకి కృతజ్ఞత వ్యక్తం చేయడానికి బదులు కృతఘ్నుత చూపడంభావ్యమా చెప్పు" అంటూ ఆమె సమాధానం కోసం ఎదురు చూడకుండా తన గదిలోకి వెళ్లిపోయాడు కాళిదాసు.

ఆ మాటతో గతంలోకి వెళ్లిపోయిందామె మనసు.

.....

ఇంటర్ చదువుతున్న రోజుల్లో ప్రీతికి కాళిదాసుతో పరిచయమైంది. ముఖ్యంగా అతడు రాసే కవితలు ఆమెను బాగా ఆకట్టుకున్నాయి. మానవ ఐక్యతకు, సహజీవనానికి కులమతాలు అడ్డుగోడగా నిలుస్తున్నాయన్న సత్యం అతడు రాసిన ప్రతిగేయంలో ప్రతిబింబించేది. కాళిదాసు మనోభావాలకు ఆకర్షితురాలైన ప్రీతి అతడికి మరింత దగ్గరగా జరిగింది. కాళిదాసు ఒంటరివాడు, పైగా తన కులస్థుడు కూడా కాదు. అయినా అతడినే మనువాడలనుకుంది. అమ్మా నాన్న కాదంటే ప్రతిఘటించింది. కూతురు

అభీష్టాన్ని త్రోసిపుచ్చి వేరే సంబంధం నిశ్చయించడంతో తప్పని పరిస్థితుల్లో ఇల్లు వదిలిపెట్టి కాళిదాసుతో ఏడడుగులు నడిచింది. వారి వివాహానికి సాక్షిగా నిలిచిన ఒకే ఒక అతిథి, ఆత్మీయుడు ఆనంద రావు. అతడి సహకారంతోనే ఇరువురూ ఒకటయ్యారు. పెళ్లి మూలంగా వారి చదువులు మూలపడ్డాయి. చదివిన చదువు కు ఉపాధి దొరక్కపోవడంతో ప్రీతి కూడా రెండిళ్ళల్లో వంట మనిషిగా కుదురుతుంది. ఇద్దరూ రెక్కలు ముక్కలు చేసుకుంటే తప్ప ఇంట్లో పొయ్యి వెలిగేది కాదు. అయినా ఒకరివట్ల మరొకరికున్న అనురాగం ముందు అలసట, ఆకలిదప్పులు తెలిసేవికావు.



రోజులు గడుస్తున్నాయి. రుతువులు మారిపోతున్నాయి. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు వాళ్ళ జీవన విధానంలో ఎటువంటి మార్పులేదు. ఎన్నేళ్లిలా దుర్భర జీవితాన్ని గడపాలో బోధపడటం లేదు కాళిదాసుకి. ఏ బ్యాంక్ అయినా రుణం ఇస్తే ఏదైనా వ్యాపారం ప్రారంభించాలని వుంది. అందుకు శక్తివంచన లేకుండా ప్రయత్నించాడు. అయినా ఎక్కడనుండి ఎటువంటి ఆర్థిక సహాయం లభించలేదు. ఇలా ఉండగా ఓమారు కన్నబిడ్డకు సుస్తీ చేస్తే హాస్పిటల్‌కు తీసుకువెళ్లాడు కాళిదాసు. డాక్టర్ ఫీజయితే చెల్లించాడుగానీ మందులు కొనడానికి డబ్బులు చాలలేదు. ఎవరిని చేబదులు అడగాలా అని అనుకుంటూ ఉండగా ఐదేళ్ళ తరువాత రెట్టింపు అవుతుందని చెబుతూ ఆనందరావు పెళ్లి కానుక యిచ్చిన వెయ్యి రూపాయిల బాండు గుర్తుకు వచ్చింది. తను ప్రీతిని చేపట్టి ఐదేళ్ళు అయిపోయాయి. అంటే అది ఈపాటికి మెచ్యూర్ అయిపోయి ఉండాలి. గబగబా ఇంటికెళ్లి పెట్టె అడుగున దాచిన బాండు బయటకు తీసాడు. దానికాల పరిమితి దాటి నాలుగు నెలలు అయిపోయింది. అది ఇప్పుడు ఈ ఆపద మసయంలో ఆదుకుంటున్నందుకు స్నేహితుడికి మనసులోకృతజ్ఞతలు తెలుపుకున్నాడు. వెంటనే బాండ్ మీద సంతకం చేసి బ్యాంక్‌లో ప్రజంట్ చేసాడు. బాండులోని వివరాల్ని సరిచూసుకుని డబ్బిచ్చాడు క్యాషియర్.

రెండువేలకు బదులు యాభై రెండువేలు అందుకున్న కాళిదాసు

అమితాశ్చర్యపోయాడు.

క్యాషియర్ పొరపాటున రెండుకు బదులు యాభై రెండువేలు ఇచ్చాడేమో అనుకుని అధికంగా ఇచ్చిన సొమ్మును వాపస్ చేయబోయాడు.

"మీకు అదిడ్రాలో వచ్చిన ప్రైజ్ మనీ" అన్నాడు క్యాషియర్.

"ప్రైజా!" నోరువెళ్లబెట్టాడు కాళిదాసు.

"ఔనండీ! బ్యాంక్ స్వర్ణోత్సవం సందర్భంగా ఆఏడు డిపాజిట్ చేసిన బాండ్లన్నీ డ్రా తీసి మూడు బహుమతుల్ని ప్రకటించడం జరిగింది. వాటిలో మీకు ద్వితీయ బహుమతి లభించింది. ఆ సొమ్మును మెచ్యూరిటీ సొమ్ముతో కలిపి ఇవ్వమన్నారు" సందేహం నివృత్తి చేసాడు క్యాషియర్.

కాళిదాసు. అనందానికి అవధులులేవు. 'థ్యాంక్యూ మైడియర్ అనందరావ్' అంటూ మిత్రుడికి లోలోపలే కృతజ్ఞతలు తెలియజేసుకున్నాడు. అనూహ్యంగా లభించిన అంత పెద్ద మొత్తం చూసిప్రీతికూడా తెగ సంబరపడిపోయింది. కాళిదాసు ఆ సొమ్ముని పెట్టుబడిగా పెట్టి చిన్న వ్యాపారం ప్రారంభించాడు. అదే అంచలంచెలుగా ఎదిగి తనకు ఇప్పుడు నెలకు వేలు తెచ్చి పెడుతోంది. ఫలితంగా వాళ్ళ జీవన విధానమే మారిపోయింది.

.....

గతించిన సంఘటనలు కళ్లల్లో మెదలడంతో ఆమె నయనాలు తడిసి పోయాయి. కంట్లో పొరలు తొలగిపోయాయి. ఈనాడు తాము సంఘంలో సగౌరవంగా తల ఎత్తుకుని తిరుగుతున్నామంటే అందుకు ఆనందరావు పెళ్లికానుకే కారణం. అదంతా ఆ కరుణామయుడి చలువే. పాపం దురదృష్టవశాత్తు అతడు యాక్సిడెంటులో పోయాడు. అతని భార్యాబిడ్డలు వీధినపడ్డారు. కృతజ్ఞతాభావంతో భర్త వారిని ఆదుకోబోతే తానెంత నీచంగా ఆలోచించింది? ఇన్నేళ్ళుగా ప్రేమను పంచి ఇచ్చిన భర్తని తానెంత హీనంగా తలచింది? పరోక్షంగా స్వల్ప భ్రమమూలంగానే పైకెదిగి ఆమెనే అవమానించి పంపిన తన కుసంస్కారానికి ఎంతగానో సిగ్గుపడింది. తనతొందరపాటును మన్నించి అతని కుటుంబసభ్యుల్ని ఇంటికి తీసుకురమ్మని చెప్పేందుకు భర్త గదిలోకి వెళ్ళింది.

"లేదు ప్రీతీ! ఆమె ఇంకెప్పుడూ ఇక్కడికి రాదు. భగవంతుడి దయవల్ల ఆమెకు ఓ ప్రయివేటు సంస్థలో ఉద్యోగం వచ్చింది. బిడ్డను తీసుకుని ఈరోజే బెంగుళూరు వెళ్లిపోతోంది" అన్నాడు కాళిదాసు చెమర్చిన కళ్లను తుడుచుకుంటూ.

( జూలై 2003 ఆంధ్రభూమి మంత్లీ )